క్లుప్తంగా

యోగాలో పామూరు విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

పామూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, ఇతర రంగాల్లోనూ సత్తా చాటాలని పామూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం సీహెచ్. రామస్వామి అన్నారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఈ నెల 2, 3 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీలో అండర్–14, అండర్–17 విభాగాల్లో పామూరు విద్యార్థులు తృతీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో సోమవారం పీఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ షేక్.మస్తానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



పొన్నలూరు యూటీఎఫ్ నూతన కార్యవర్గం

పొన్నలూరు: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షునిగా కమ్మిశెట్టి మాల్యాద్రి, అధ్యక్షునిగా చౌడం లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గొట్టిపాటి మాధవరావు, కోశాధికారిగా పగడాల వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులుగా సుబ్బారావు, ఎస్ తిరుమలేశ్వరి ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు.

రసూల్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



రసూల్‌రెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న దద్దాల, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోను రసూల్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. కోవిలంపాడు గ్రామానికి చెందిన గోను రసూల్‌రెడ్డి అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. దద్దాల నారాయణయాదవ్ స్థానిక నాయకులతో కలిసి రసూల్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, గోను చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బజాజ్‌బుజ్జి, ఉపసర్పంచ్ మిరియం వెంకటేశ్వర్లు, బక్కా భాగ్యరాజు, నాయకులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

సింగరాయకొండ: సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి మండలాల్లోని గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీహెచ్ హజరత్తయ్య హెచ్చరించారు. గ్రామాల్లో అనధికార మద్యం విక్రయాలు నిర్వహించకూడదని సూచించారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న వారి సమాచారాన్ని తెలియజేస్తే వెంటనే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు తమకు సహకరించి అక్రమంగా మద్యం అమ్మకం దారుల వివరాలను 9121102135, 9121102136, 9121102137, 9121102138 నంబర్లకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళి

కొండపి: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ఓటర్లకు సంబంధించి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ మురళి తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ తేదీల్లో శిబిరాలకు హాజరై ఓటర్ కార్డుకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా బీఎల్‌ఓలకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు.

రైతు సేవలకు గ్రహణం



రైతు భరోసా కేంద్రం



మూలన పడిన కియోస్క్ యంత్రం

- దిష్టి బొమ్మల్లా కియోస్క్ యంత్రాలు
- నిర్వీర్యమవుతున్న ఆర్బీకేలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆర్‌బీకేల ఏర్పాటు
- కూటమి ప్రభుత్వంలో వాటి వైపు కన్నెత్తి చూడని నేతలు

కనిగిరి రూరల్: విత్తనం నుంచి పంట విక్రయం వరకు అన్నదాతలకు ప్రతి అడుగులో అండగా నిలబడాలని ఉన్నత ఆశయం, లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకేలు) నిర్వీర్యం అవుతున్నాయి. విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు ఇలా రైతులకు కావాల్సిన సరంజామాను సమకూర్చుకునేందుకు ఆర్‌బీకేలు ఎంతో అండదండగా ఉండేవి. కియోస్క్ యంత్రాల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని వారికి కావాల్సిన రకం విత్తనాలు వగైరా వాటిని తెప్పించుకుని తీసుకునేవారు. కానీ కొంత కాలంగా సాంకేతిక లోపమా.. ఇంటర్‌నెట్ సమస్య తదితర కారణాలతో కియోస్క్ యంత్రాలు మూలనపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాల్లో రైతుల సేవలకు గ్రహణం పట్టిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నియోజకవర్గంలో 96 ఆర్బీకేలు..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 96 ఆర్బీకే కేంద్రాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేశారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులకు డిజిటల్ విధానంలో, సాంకేతికంగా సత్వర, నాణ్యమైన, మెరుగైన సేవలకోసం కియోస్క్ యంత్రాలను పెట్టారు. లక్షలాది రూపాయలు వెచ్చించి యంత్రాలను ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు వగైరా రైతులకు పంట సమయంలో కావాల్సిన వాటిని అందించారు. పంటల ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలో ఉన్న మార్కెట్ వివరాలు, తదితర అవసరమైన సేవలను ఈ డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా తెలుసుకునేందుకు వీలుంది. కచ్చితమైన సమాచారం, ఫలితాలతో నాడు అన్నదాత రైతన్న వ్యవసాయ శాఖ ద్వారా అన్ని సేవలను పొందారు. వాతావరణ సమాచారం, వాతావరణంలో మార్పులు, ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. నాడు రైతులకు ఎంతో మేలు చేసి కియోస్క్ యంత్రాలు నేడు నిరుపయోగంగా మారి.. ఆర్బీకేల్లో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

నిర్లక్ష్యపు నీడలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాలు, కియోస్క్ యంత్రాల వినియోగంపై నిర్లక్ష్యపు, నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రస్తుతం సాంకేతిక లోపం, ఇంటర్ నెట్ సౌకర్యం లేక ఇతరత్రా కారణాలతో నియోజకవర్గంలోని దాదాపు 99 శాతం కియోస్క్ యంత్రాలు మూలన పడ్డాయి. కొన్ని చోట్ల వీటి కనీస ఆలన పాలన లేక దుమ్ము పడుతున్నాయి. గతంలో కచ్చితంగా రైతు భరోసా కేంద్రాల ద్వారానే రైతులకు కావాల్సినవన్నీ అందేవి.. ప్రస్తుతం ప్రభుత్వంలో వాటి సేవలు కూడా అరకొరగా మారాయి. దీంతో అనేక గ్రామాల్లోని రైతులు ప్రైవేట్ డీలర్లను ఆశ్రయించి అధిక ధరలు పెట్టి ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు తదితర సామాగ్రిని కొనుగోలు చేస్తున్నారు. రానున్న రబీ సీజన్‌లో అయిన కియోస్క్ యంత్రాల వినియోగానికి ప్రభుత్వం దృష్టి సారిస్తుందో లేదో వేచి చూడాలి. ఇంటర్‌నెట్ సౌకర్యం లేక, సాంకేతిక కారణాలతో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయని.. పలుచోట్ల క్షేత్ర స్థాయిలో గల వ్యవసాయ సిబ్బంది, రైతులు, రైతు నాయకులు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కియోస్క్ యంత్రాలు దిష్టిబొమ్మల్లా మారి వెక్కిరిస్తున్నాయి.

నియోజకవర్గంలోని ఆర్‌బీకేలు

కనిగిరి	–	23
పామూరు	–	19
పీసీపల్లి	–	13
హెచ్‌ఎంపాడు	–	14
వెలిగండ్ల	–	12
సీఎస్‌పురం	–	15
మొత్తం	–	96

ఇళ్ల పట్టాలివ్వాలని ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కనిగిరి రూరల్: గిరిజనులకు, అర్హులైన పేదలకు ఇంటి నివేశన స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ యాసీన్ మాట్లాడుతూ పట్టణంలోని 11,12, 2 వ వార్డులకు చెందిన ఎంతో మంది ఎస్టీలు కనీస ఇంటి నివేశన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్థానిక పాదిలి రోడ్డులోని టుబాకో బోర్డు వెనుక ఉన్న సర్వే నంబర్ 19లో కొండ దగ్గర ఖాళీ ప్రదేశంలో పూరి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఒక్కో ఇంట్లో సుమారు రెండు మూడు కుటుంబాలు తలదాచుకుంటూ 100 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారని, వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి జీపీ రామారావు మాట్లాడుతూ కాశిరెడ్డి కాలనీ, బొగ్గుల గొంది కాలనీ, ఎస్టీ కాలనీల్లో ఇంటి స్థలాలు లేక దయనీయంగా జీవిస్తున్న గిరిజనులకు తక్షణం ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, హౌసింగ్ కాలనీలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు ఖాశింవలి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జీ రమణయ్య, జయంపు కోటయ్య, అంకమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు



మాట్లాడుతున్న సయ్యద్ యాసీన్

కనిగిరి రూరల్: విద్యా రంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని.. విద్యా కాషాయీకరణను విద్యార్థి, యువత వ్యతిరేకించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర మాజీ నాయకుడు సయ్యద్ యాసీన్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమావేశ మందిర ప్రాంగణంలో సోమవారం ఏఐఎస్‌ఎఫ్ 20వ మహాసభలు జి.సురేష్, భాగ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భ,గా ఆయన మాట్లాడుతూ విద్యా పథకాల అమలులో ప్రభుత్వాలు విఫలం చెందాయన్నారు. విద్యార్థులు, యువత సమాజంలోని రుగ్మతలపై, చదువుతూ పోరాడు.. చదువుకై పోరాడు అనే నినాదంతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు జీపీ రామారావు, సీహెచ్ పవన్ కళ్యాణ్‌లు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, మెనూ చార్జీలను పెంచాలని, కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, నూతన విద్యా విధానంలో మార్పులు రావాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా పథకాలను అమలు చేయాలని, పాఠశాలల్లో మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తొలుత మహాసభల జెండాను సీహెచ్ పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మాజీ నాయకులు పందిటి మోహన్, ఎస్‌కే ఖాశింవలి, పుట్టా సుబ్బారావు, మండల కన్వీనర్లు సయ్యద్ ఇస్రాజ్, భాగ్య, సబిహా పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం ఏఐఎస్‌ఎఫ్ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టి.సంజయ్‌బాబు, కార్యదర్శిగా జి.సురేష్, ఉపాధ్యక్షులుగా టి.జీవన్ బాబు, సహాయ కార్యదర్శిగా డి.హరిప్రసాద్, కోశాధికారిగా దీక్ష, కమిటీ సభ్యులుగా నెహా మియా, చరణ్, మౌనిక, రమ్యలలనుఎన్నుకున్నారు.

భైరవకోనలో ప్రత్యేక పూజలు



భైరవకోనలో పూజల్లో పాల్గొన్న దద్దాల దంపతులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం భైరవకోనలో కార్తీక సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, సర్పంచ్ దద్దాల మంజుభార్గవి దంపతులు భైరవకోన క్షేత్రానికి వచ్చి త్రిముఖ దుర్గాదేవి, భర్గులే శ్వర, కాల భైరవ, నగరేశ్వర ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం జలపాతాన్ని సందర్శించారు. దద్దాల దంపతులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేసి స్వామి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. నాయకులు ముత్యాల నారాయణరెడ్డి త్రిముఖదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహశీల్దార్ బీవీ రమణారావు

పామూరు: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బీవీ రమణరావు, సీడీపీఓ పి.సరోజినీ అన్నారు. పామూరుకు చెందిన స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో బాల్యవివాహాలపై వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు 18, బాలురకు 21 ఏళ్లు నిండితే వివాహాలు చేయాలన్నారు. ప్రభుత్వాలు బాల్య వివాహాల నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయన్నారు. బాల్య వివాహానికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సీడీపీఓ సరోజిని, ఎంపీడీఓ బొలినేని సురేష్, ఈఓపీఆర్‌డీ కేఎల్ శ్రీనివాసరావు, ఎంఈఓ గరికపాటి కరుణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, పలువురు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎం సమస్యలు పరిష్కరిస్తాం



టంగుటూరులో అర్జీ తీసుకుంటున్న తహసీల్దార్ అంజనేయులు

టంగుటూరు: జాయింట్ ఎల్‌పీఎం సమస్యతో సమస్యలు ఎదుర్కొంటున్న భూ యజమానులకు స్థానిక రెవెన్యూ కార్యాలయంలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సులో 5 రెవెన్యూ, 1 సివిల్ సప్లయ్‌కు సంబంధించిన సమస్యలపై అర్జీలు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ సమస్యల్లో ముఖ్యంగా జాయింట్ ఎల్‌పీఎంలు మండల వ్యాప్తంగా 2200 వరకు ఉన్నాయని, ఇప్పటి వరకు 600 మంది మాత్రమే అర్జీలు తమ దృష్టికి వచ్చాయన్నారు. మండలంలో 3వ దశలో ఉన్న రీసర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం చేసేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ విజయ్‌కుమార్



తాళ్లూరులో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ

కొండపి: రైతులు పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధిస్తారని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మూగచింతల, నెన్నూరుపాడు గ్రామాల్లో పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా మినుము, శనగ, బొబ్బర్లు, కంది పంటలు సాగు చేయాలని సూచించారు. శనగ పంట వేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని, శనగ పంట సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలన్నారు. ఏటా ఒకే పంట సాగు చేయడం వల్ల భూసారం తగ్గుతుందని రైతులకు సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కె. వెంకటరావు, హెచ్.జోత్స్న, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలుగా మినుము, పప్పు శనగ పైర్లను సాగు చేయాలని ఏడీఏ ఈ వెంకట రమణ అన్నారు. మండలంలోని తాళ్లూరులో రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వేలంకేంద్రం సూపరిండెంట్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పొగాకు రైతులు ఎక్కువగా పొగాకు సాగుపై దృష్టి సారించవద్దని సూచించారు. మిగతా రాష్ట్రాల్లో ప్రస్తుతం ఎక్కువగా సాగై అమ్మకాలకు సిద్ధంగా చేసినట్లు తెలిపారు. దీనివల్ల గతంలో మాదిరిగా పొగాకు ధరలు అధికంగా ఉండవని వివరించారు. ఏఓ పి.జోత్స్నాదేవి మాట్లాడుతూ రబీ పంటల సాగు గూర్చి, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం గురించి వివరించారు. వ్యవసాయ సిబ్బంది, పొగాకు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక శోభ



సాయిబాబా దేవస్థానంలో పూజలు

కనిగిరి రూరల్: ఆలయాల్లో కార్తీక శోభ నెలకొంది. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకించి శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. భక్తులు వేకువజాము నుంచే ఎంతో నియమ నిష్టలతో శివాలయాలకు వెళ్లి పూజలు చేశారు. స్థానిక సాయిబాబా దేవస్థానంలో భవాని శంకర స్వామికి విశిష్ట పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని నందన మారెళ్లలో ఉన్న బాలకోటేశ్వర స్వామికి, పునుగోడులోని సిద్ధేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభాల వద్ద ఎంతో నియమ నిష్టలతో ప్రమిదుల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ పూజారులు సుబ్బయ్య, రవి స్వామి ఆధ్వర్యంలో విశిష్ట పూజలు నిర్వహించారు.

పామూరు: కార్తీకమాసం మొదటి సోమవారం వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక వల్లీసమేత భుజంగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అర్చకులు మహంకాళి శివప్రసాద్ ఏకాదశ రుద్రాభిషేకం, వల్లీ అమ్మవారికి కుంకుమపూజ నిర్వహించగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. స్థానిక శ్రీమదన వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, రమాసమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయం, అయ్యప్ప ఆలయంతో పాటు సహస్రలింగేశ్వరస్వామి, అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగాల ఆలయం, బొట్లగూడూరులోని కామాక్షీసమేత రామలింగేశ్వరస్వామి, దాదిరెడ్డిపల్లెలోని పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి, పడమటి కట్టకిందపల్లెలోని శ్యామలా కామాక్షి సమేత మల్లేశ్వరస్వామి, మోపాడు పంచాయతీ పరిధిలోని గొందిమల్లేశ్వరస్వామి, అనుమునిగిరి శివరామ బ్రహ్మక్షేత్ర ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వీసీపల్లి: మండల పరిధిలోని పెద్ద యిర్లపాడు మల్లేశ్వర స్వామి దేవాలయంలో, వెంగళాపురం సమీపంలో పాలేటి ఒడ్డున వెలసి పంచలింగాలకొండ ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు వేకువజామునే ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

వైభవంగా కోటిదీపోత్సవం

సింగరాయకొండ: కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని కోదండరామ దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ మహిళలు భక్తిశ్రద్ధలతో కోటి దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కోదండరామునికి దీపార్చన చేశారు.

టంగుటూరు: కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. మహిళలు తెల్లవారుజాము నుంచే కార్తీక దీపాలు వెలిగించారు. జమ్ములపాలెంలోని పంచముఖేశ్వర స్వామి 1116 శివలింగాల ఆలయంలో స్వామికి పంచామృత అభిషేకాలు, గోత్రనామార్చన వంటి విశేష పూజలు చేశారు. పసుకుదురులోని పురాతన శివాలయంలో, జమ్ములపాలెంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంగమేశ్వరం ఆలయంలో పూజలు

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో ప్రసిద్ధి. చెందిన సంగమేశ్వరం ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు తరలివచ్చి దీపాలు వెలిగించి స్వామికి విశేష పూజలు ర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, పెద్దలు భక్తులకు ప్రసాదం అదించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



పునుగోడు సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పూజలు



నందన మారెళ్ల గుడిలో పూజలు



సింగరాయకొండ: కోటిదీపోత్సవంలో పాల్గొన్న మహిళలు



పామూరు భుజంగేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



జమ్ములపాలెంలో 1116 శివలింగాలను దర్శించుకుంటున్న భక్తులు



చెన్నిపాడు సంగమేశ్వరం ఆలయంలో మహిళలు పూజలు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

కనిగిరి రూరల్: జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర అన్నారు. డిసెంబర్ 14న కనిగిరి కోర్టులో జాతీయ లోక్ ఆదాలత్ జరుగుతుందని, ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చునన్నారు. పోలీసులు, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

స్పందన అంతంత మాత్రమే



సాంకేతిక సమస్యతో వీడియో కాన్ఫరెన్స్ జరగని దృశ్యం

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి స్పందన అంతంత మాత్రంగా వస్తోంది. సోమవారం జరిగిన కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చాయి. కనుమళ్ల పంచాయతీలో కుంటలు, రోడ్లు, డొంకలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, సమగ్ర సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలని అర్జీ ద్వారా గ్రామస్తులు కోరారు. మరొక అర్జీ భూ కొలతలకు సంబంధించినది. అయితే ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులను సమన్వయం చేస్తూ జరగాల్సిన టెలీ కాన్ఫరెన్స్ సాంకేతిక సమస్య కారణంగా సక్రమంగా జరగలేదని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేవలం కొద్ది శాఖల అధికారులు తప్ప మిగతా శాఖల అధికారులు డుమ్మా కొట్టారు.